# రెటమతం మొగుడు! - పెడసరం పెళ్ళాం!

పెళ్ళిచూపుల సమయంలో... శోభనం రాత్రి ఎంత అమాయకంగా అవుపించాడు? నోట్లో వేలు పెడితే కొరకలేని వాడని భ్రమించాను. కాబోయే భర్త మెతకవాడైతే బాగుండుననే కోరిక తీరనున్నందుకు సంబరపడి సంతోషించాను.

తీరా కాపురానికొచ్చాక తెలిసింది మొగుడు మహాశయుడు అసాధ్యుడని! ఇలాంటి గడుసు పిండంతో ఎలా వేగటమాని భయపడి చచ్చాను.

'పుల్లవిరుపు మాటలు... ఎత్తిపొడుపు సెటైర్లతో మనశ్శాంతి లేకుండా చేయటం చూస్తూ సహించలేకపోతున్నాను.'

ఎంత నాటకమాడి బుట్టలో వేసుకుని నంగనాచిలా అవుపించాడు?... తీరా పెళ్ళి అయ్యాక అంతా రివర్స్ అయినందుకు మోసపోయి తాళి కట్టించుకున్నాను సుమా అనుకోక తప్పలేదు.

అమ్మ మొగుడా... ఇదా నీ నిజస్వరూపం? ఇలాంటి మొగుళ్ళుంటారనే... నేనసలు పెళ్ళే చేసుకోకూడదని నిశ్చయించుకున్నాను.

కానీ... పెళ్ళిచూపులప్పుడు అబ్బాయి అంత మంచివాడు... ఇంత గొప్పవాడనేసి అతగాడి బంధువర్గమే కాకుండా... నా పేరెంట్స్ కూడా నమ్మించి నా మెడలు వంచారు. రెటమతం మొగుడు కిచ్చి కట్టబెట్టారు.

చెప్తా... చెప్తా...! కీలెరిగి వాతపెడతా. అప్పుడుగాని భర్తగారి రోగం కుదరదు. కాపురమంటే ఎంత హాట్‌హాట్‌గ... కారం కారంగ ఎఫ్.ఎమ్ బాండ్ మిర్చి మసాలా ప్రోగ్రాంలా వుంటుందో రుచి చూపిస్తేగాని అయ్యగారి తిక్క కుదరదు.

పెళ్ళామంటే అంత చులకనా? ఎగిరెగిరి పడకురా మొగుడా... నా టాలెంటేమిటో చూపిస్తాను... అనేసి మనసులో డిసైడైనాను.

చీటికి మాటికి చిర్రుబుర్రులాడే స్టేజీ దాటి... నోటికొచ్చినట్టల్లా నాన్‌స్టాప్‌గ తిట్టిపోయటమనే సెకండ్ ఎపిసోడ్‌లోకి అడుగుపెట్టాను.

ఇదీ ఫెయిలవటాన... సామదాన బేధ దండోపాయాల్లో చివరిది ప్రయోగించటం తప్పదన్పించింది.

ఒకరోజు నాపై చెయ్యెత్తినందుకు... నాగుపాములా బుసకొట్టి... సర్రున వంటింట్లో వున్న కత్తిపీట అందుకుని అపరకాళిలా శివతాండవం చేయక తప్పలేదు.

అక్కడితో హడలిపోతాడేమో అనుకున్న నాకు డిజపాయింట్‌మెంటే ఎదురైంది.

నిజానికి... మగాడి ఎనర్జీ లెవల్స్‌ముందు ఆడదానికి శక్తి ఎంత? అన్పించకపోలేదు. అందుకే వేటువేద్దామనుకున్నా తక్కున ఆగాను. ఎంతైనా భర్త కదా?- అనుకుని సాధుజంతువులా మెత్తపడాల్సి వచ్చింది.

చేతిలో గల కత్తిపీట కిందకు దించి నేలమీద దూరంగ విసిరేసి 'ఖబడ్దార్!' పెళ్ళామంటే పిప్పర్‌మెంట్ బిళ్ళనుకున్నావా చప్పరించటానికి?- నో!- నేను అందరిలాంటి ఆడదాన్నికాదు. పెళ్ళామంటే పెంపుడు కుక్కో... పిల్లో అనుకునే కాలం చెల్లింది... ఇది మహిళా యుగం! మనిద్దరికీ పక్కపంచుకోవటంలోనే కాదు... కొట్టుకు చావటంలోనూ సమాన హక్కులున్నయ్. బీకేర్‌ఫుల్... నోరు పారేసుకున్నా... చెయ్యి పైకెత్తినా సహించేదిలేదు... అంటూ హూంకరించాను.

నా మాటలు... గరిట కాల్చి వాతపెట్టినట్టు అన్పించినయ్యేమో... కిక్కురుమన్లేదు. బిక్కచచ్చిపోయాడు.

నువ్వింత గడుసుదానివి... పెడసరం ఆడదానివీ అనుకోలేదు. నీలాంటిదాన్ని చేసుకున్నందుకు లెంపలేసుకోవలసిందే... అనుకుంటూ సుడిగాలిలా వీధిలోకెళ్ళాడు సుందరమూర్తి.... అదే నా హజ్బెండ్!

ఆ రాత్రే కాదు... మరో పదిరోజులపాటు ఇంట్లో వన్‌ఫార్టీ సెక్షనో... కర్ఫ్యూనో విధించినట్టన్పించింది. ఆలుమగలు మధ్య సామరస్య ధోరణి అదృశ్యమైంది. ఎడమొహం... పెడమొహం!

★ ★ ★ ★ ★

దీనంతటికీ అసలు కారణం నాకు బోధపడింది!

పెళ్ళి అయ్యాక పరుడి ఇంటికెళ్ళి గృహప్రవేశం చేయాల్సిన తరుణంలో సింహద్వారం వద్ద గుమిగూడి వున్న తరుణులంతా ముక్తకంఠంతో కుడికాలు ఇంట్లోపెట్టి రమ్మని ఆజ్ఞాపించినా... చెవికెక్కించుకోని శ్రీవారు కావాలనే ఎడం పాదంమోపి లోనికి ఎంట్రెన్స్ ఇవ్వటమే దీనంతటికీ కారణమై వుంటుంది అన్పించకపోలేదు.

పసుపు బట్టల్లో వున్న మమ్మల్ని పేర్లు చెప్పమని బలవంతం చేసినప్పుడు కూడా

'ఏం? చెప్పకపోతే లోనికి రానివ్వరా?... ఆ తర్వాత మమ్మల్ని కాపురం చేసుకోనీయరా?... అంటూ రెటమతంగా మాట్లాడటం నాకు బొత్తిగా నచ్చలేదు.

మంగళహారతి పళ్ళెంలో ఆడపడుచు లాంఛనంగ డబ్బు వేయమని అడాళ్ళంతా ఏకమై అడిగినా... 'నాన్సెన్స్! ఏమిటీ యాచన?... ఇలాంటి ముష్ఠి అడుక్కోవటం నాకు గిట్టదు...' రెటమతంగ మాట్లాడిన నా భర్త ధోరణికి విస్తుపోయాను.

కొత్త పెళ్ళికూతురిని నోరెత్తకూడదు కదాని వూరుకున్నాను. ఇలా రెటమతంగ మాట్లాడే ధోరణేంటి చెప్మా? అనేసి మనసులో గొణుక్కున్నాను.

ఆ రాత్రికి శోభనం ఏర్పాట్లు జరిగినయ్! రొటీన్ టైప్‌లో పాలగ్లాసుతో ఎంటరైన నన్ను చూచి 'వాట్? మిల్కా?'... నో! నా వంటికి పడదు. నొసలు చిట్లించి కోపం అభినయించిన భర్త ధోరణికి విస్తుపోయాను.

'మీ టేస్టేమిటో నాకు తెలీదు కదా?... వాళ్ళిచ్చింది నేతెచ్చాను...' అని రిప్లై ఇచ్చాను సింపుల్‌గా.

పాలగ్లాసు మీదపడి లాక్కున్నంత పనిచేసి విసిరికొట్టిన చేష్ఠకి విస్మయానికి లోనయ్యాను.

ఇదేం మనిషి? ఇదేం రెటమతం? ప్రథమ కలయికలోనే ఇంతటి గీర్వాణం... కోపం... ప్రదర్శించాలా? అనేసి నివ్వెరపోయాను.

'ఇంకా అక్కడే నిలబడ్డావేం... దీపస్తంభంలాగ?... దగ్గరకు రావా? వస్తే షాక్ కొడుతుందని భయమా?...'

భర్త ధోరణి నాకు రుచించలేదు. ఇదేం ఖర్మరాబాబూ... శోభనం రాత్రి ఇలా తగలడ్డది... అనుకున్నాను. ఏం మాట్లాడితే ఈ రెటమతం మనిషితో ఏం వుపద్రవం ముంచుకొస్తుందోని మూగదాన్నే అయినాను.

నేను నోటికి చెయ్యి అడ్డుపెట్టుకోవటం చూచి 'ఏంటి?- వాంతి చేసుకుంటావా?... వికారంగా వుందా?' హేళన ధ్వనించింది భర్త సుందరమూర్తి మాటల్లో.

'అవునండీ... సెంటు వాసన... అగరొత్తుల వాసనా... నాకు పడదు...' విన్పడీ విన్పడనట్టు గొణిగాను.

'ఏమిటీ అవతారం? తెల్లచీర కట్టుకున్నావేం? ఇదెప్పుడు కట్టుకుంటారో తెలుసా?... ఆడదానికి పసుపు కుంకుమలు పోయాక. ఐ హేట్ దిస్ కలర్ శారీ... వెళ్లు! వెళ్ళి

'ఏదైనా కలర్‌ఫుల్ పట్టుచీర కట్టుకురా....' చీదరించుకున్నట్టే మాట్లాడాడు.

విద్యావంతుడు... సభ్య సమాజంలో గౌరవప్రదమైన జాబ్ చేస్తున్నవాడు నా మొగుడైనందుకు సంబరపడుతున్న శుభఘడియల్లో... భర్త వింత విచిత్ర విపరీత ధోరణి నన్ను మానసికంగా కృంగదీసింది.

శోభనం రాత్రి... భావి జీవితానికి తీయని పునాదులు వేసుకోవలసిన శుభ తరుణంలో... మనసువిప్పి ముచ్చట్లాడుకోవలసిన మధురమైన ఘడియల్లో... సుందరమూర్తి మాటల ధోరణి నన్నూ నా హృదయాన్నీ గాయపరచినయ్.

'ఖర్మ!... శాడిస్ట్ భర్త కాదు కదా?... ఇలాంటి వ్యక్తితో కాపురం సజావుగా సాగేనానే భయంతో నా మనసు విలవిల్లాడింది.

ఇలాంటి మనిషి నా జీవిత భాగస్వామి అవుతాడని కలలోనైనా వూహించలేదు.

పెళ్ళిగురించి ఎన్నో... ఎన్నెన్నో తీయని కలలు కన్న నాకు ఎదురుదెబ్బ తగిలి నా హృదయాన్ని తొలిదశలోనే గాయమవటం నా దురదృష్టమనుకుని వాపోయాను.

మరో చీరె మార్చుకోవటానికి వెళ్ళటమా వెళ్ళకపోవటమా? వెళ్ళకుంటే భర్త ప్రవర్తన ఇంకెంత విపరీతంగ వుంటుందో?... తీరా గదిలోంచి బైటికెళితే ఆడవారంతా చుట్టుముట్టి ప్రశ్నలతో కాకుల్లా పొడుస్తారేమో?... ఎటూ తేల్చుకోలేని సందిగ్ధావస్థలో మనసు కొట్టుమిట్టాడుతోంది.

హే భగవాన్? ఏమిటీ విషమ పరీక్ష?...

శోభనం రాత్రే ఎడమొహం... పెడమొహంగ చెరొకవేపు తిరిగి పడుకోవలసి వచ్చినందుకు నా మనసు క్షోభకు గురైందనే నిజాన్ని తెల్లవారిన తర్వాత ఇంట్లో ఎవరికీ తెలీనివ్వకుండా మనసులోనే నిక్షిప్తం చేశాను.

★ ★ ★ ★ ★

'కోడలా!... నా కొడుకున్నాడే... అదే నీ మొగుడు సుందరమూర్తి వఠ్ఠి రెటమతం మనిషి! వాడితో అవస్త పడక తప్పదు. ఓర్పుతో నువ్వే సర్దుకుపోవాలి...' చావు కబురు చల్లగా చెప్పినట్టు మాట్లాడింది అత్తగారు అనసూయమ్మ.

నేను మాత్రం తక్కువ తిన్నానేంటి? కీలెరిగి వాత పెట్టగల సమర్థురాలిని!

'వాడొఠ్ఠి మొండివాడు. నోటికెంతొస్తే అంత అనేస్తాడు. ఎడ్డెమంటే తెడ్డెమంటాడు. యస్సంటే నో అంటాడు. తినమంటే వద్దంటాడు. లేనిది కావాలంటాడు. వాడి ధోరణే

వాడిది. చిన్నప్పటినుంచీ అంతే...'

అత్తగారి మాటలకి వళ్ళు మండింది.

'ఇంకో విషయం చెప్పనా!... వాడిని డాక్టరో ఇంజనీరో చేయాలని మీ మామగారి పట్టుదల! వాడు వింటేనా? కంప్యూటర్ కోర్స్ చేశాడు. ఇదీ గౌరవప్రదమైన వుద్యోగమేననుకో... నెలకు అరవైవేలు జీతం...' ముసిముసిగా నవ్వింది అనసూయ.

ఇలాంటి మహానుభావుడు ఎంత చదివితేనేం?... ఎంత సంపాదిస్తేనేం? కట్టుక్కున్న పెళ్ళానికి సుఖమయ జీవితం లేకపోయాక అన్పించింది.

★★★★★

నేను జాబ్ చెయ్యాలనుకుంటున్నాను... మనసులో మాట భర్తతో అన్నాను కాఫీ అందిస్తూ.

'వాట్! వాట్ వాట్ వాట్?-'

'అవును నాకూ లక్ష అవసరాలుంటయ్. పైసా పైసా మిమ్మల్ని అడగాలంటే...'

'నీకు నామోషీగా వుంది... అవునా?

'కాదు బాధగా వుంది...'

'ఏమిటోయ్ నీ అవసరాలు? లిప్‌స్టిక్... నెయిల్ పాలిష్... క్రీములు... పౌడర్లు... బ్యూటీపార్లర్స్‌కెళ్ళటాలు! అంతేగా? ఐ డోన్ట్ లైక్ దిస్ వేస్ట్ ఎక్స్‌పెండిచర్!...'

'ఆపండి మీ సోది! ఒక సినిమా లేదు... షికారు లేదు... మీ కసలు టేస్టేలేదు...'

'అదీ నీ ఏడుపు! అయితే ఇంకేం? స్లీవ్‌లెస్ జాకెట్టు... బాబ్డ్ హెయిర్ స్టైల్‌తో నువ్వూ వుండు... అట్లాగే పబ్స్‌కు... క్లబ్స్‌కు... బార్లకు తీసుకెడతాను... ఏం?-'

ఆ మాటల్లో ఇమిడివున్న వెటకారం నన్ను మరింత రెచ్చగొట్టింది.

'స్త్రీ స్వాతంత్ర్యం... ఉద్యోగం... సమాన హక్కులూ అంటూ వీధినపడితే... నీకు నాకు రాం... రాం!...'

'అంటే...'

'వెరీ సింపుల్!... డైవర్స్!'

'మీరింతటి సంకుచిత స్వభావులని పెళ్ళికి ముందే గ్రహించి వుంటే... నా జీవితం వేరొక మలుపు తిరిగి వుండేది. మీకంటూ ఓ టేస్ట్‌లేదు.... లైకింగ్ లేదు. ఎదుటి వాళ్ళ

మనసును గాయపరుస్తూ వ్యంగ్యంగ... వెటకారంగ మాట్లాడి ఫీలింగ్స్‌ను హర్ట్ చేయటమే మీ సరదా... మీరు సుఖపడలేరు... కట్టుకున్నదాన్ని... కన్నవారినీ సుఖపెట్టలేరు...' ఆవేశంగ మాట్లాడాను.

'షటప్... యూ డెవిల్...' సుందరమూర్తి మీదిమీదికొచ్చాడు.

'షటప్... యూ... ఇడియట్!... ఫూల్... రాస్కెల్...' నోటికొచ్చినట్టల్లా వాగి భద్రకాళినే అయినాను.

భర్తమీదికి లంఘించి గోళ్ళతో రక్కాను. అందిన చోటల్లా కొరికి గాయపరిచాను.

సుందరమూర్తి నా చర్యకు బిత్తరపోయాఏమో గింజుకుని వెనక్కు తగ్గాడు.

భర్త ముఖంలో భయాన్ని చూడగలిగాను. నన్నెదిరించగల సాహసం... శక్తి అతనిలో లోపించినట్టు గ్రహించాను.

మనం సుఖపడలేం... లెటజ్ టేక్ డైవర్స్... అసెంబ్లీలో అప్పొజిషన్ పార్టీ లీడర్ లాగ ఎదురుదాడికి దిగేను.

సుందరమూర్తి తీవ్రంగ ఆలోచించి ఓ నిర్ణయానికొచ్చి... సరసం విరసం కాకూడదనుకున్నాడో ఏమో 'చూడు డియర్! భార్యాభర్త అంటే... మేడ్ ఫర్ ఈచ్ అదర్‌లా వుండాలి! మనం అందుకు భిన్నంగ ప్రవర్తిస్తున్నాం!- తప్పు ఇరుపక్షాన వుంది!- ఐ యామ్ సారీ... నా వ్యవహారశైలి పూర్తిగా మార్చుకుంటాను...' సరెండరైనట్టు మాట్లాడాడు.

భర్తలో నా చర్యల ద్వారా మార్పు తేగలిగినందుకు నా మనసు సంతోషంతో పురకలేసింది. ఇప్పుడొచ్చావురా మొగడా దారికి అనుకున్నాను.

'ఐటూ సారీ డియర్! ఇంకెప్పుడూ మీ మనసు నొప్పించను. ప్రామిస్...' చేతిలో చెయ్యి వేశాను.

బిగి కౌగిట్లో ఇమిడిపోయిన ఇద్దరూ ఐమీన్... రెటమతం మొగుడు - పెడసరం పెళ్ళాం హాయిగా తృప్తిగ మనసారా నవ్వుకున్నారు! మనసులు తేలిక పడినట్టన్పించినయ్!

- సమాప్తం -